క్లుప్తంగా

గాంధీ ఆశ్రమంలో సర్వమత ప్రార్థనలు



గాంధీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఆశ్రమ సభ్యులు

ఇందుకూరుపేట : మండలంలోని పల్లిపాడులో ఉన్న పినాకిని సత్యాగ్రహ గాంధీ ఆశ్రమంలో ఆదివారం సర్వమత ప్రార్థనలు నిర్వహించారు. ఆశ్రమ కో–కన్వీనర్ నెల్లూరు రవీంద్ర రెడ్డి ఆధ్వర్యంలో హిందూ, ముస్లిం, క్రైస్తవ, బౌద్ధ, జైన్ తదితర మతాలకు సంబంధించి ప్రార్థనలు జరిగాయి. తొలుత ఆశ్రమంలోని మహాత్మా గాంధీ, స్థలదాత పొణకా కనకమ్మ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ మనోజ్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఆక్రమణల తొలగింపునకు రంగం సిద్ధం



దుకాణదారులతో మాట్లాడుతున్న స్వర్ణ టోల్‌వే సిబ్బంది

మనుబోలు : మండల కేంద్రమైన మనుబోలు వైఎస్సార్ సర్కిల్ వద్ద హైవే స్థలం ఆక్రమించి నిర్వహిస్తున్న దుకాణాలను తొలగించేందుకు స్వర్ణ టోల్‌వే సిబ్బంది నడుం బిగించారు. ఈ మేరకు శని, ఆదివారాల్లో స్వర్ణ టోల్‌వే సిబ్బంది వైఎస్సార్ సర్కిల్ వద్ద ఉన్న దుకాణదారులతో మాట్లాడారు. వైఎస్సార్ సర్కిల్ వద్ద మనుబోలు గ్రామంలోకి వెళ్లే రోడ్డు, హైవేకి మధ్యలో త్రిభుజాకారంలో సుమారు 20 సెంట్ల స్థలం ఖాళీగా ఉంది. ఇక్కడ పలువురు కూరగాయలు, ఫాస్ట్‌ఫుడ్, టిఫిన్ దుకాణాలు నిర్వహిస్తున్నారు. చాలా కాలంగా ఇక్కడ టిఫిన్ దుకాణం నడుపుతున్న ఓ వ్యక్తి నాలుగు రోజుల క్రితం అంగడికి రేకులు వేసే క్రమంలో వేపచెట్టు కొమ్మ అడ్డుగా ఉందని కొట్టేశాడు. బస్సులు, ఆటోల కోసం వేచి చూసే ప్రయాణికులకు నీడనిస్తున్న వేపచెట్టు కొమ్మను నరికేయడంతో స్థానికులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో రేకుల షెడ్డు నిర్మాణాన్ని అడ్డుకున్న పోలీసులు సదరు దుకాణ యజమానిని పిలిపించి హెచ్చరించి పంపించారు. టిఫిన్ దుకాణం యజమాని శుక్రవారం మరోసారి తాత్కాలికంగా షెడ్డు వేయడంతో స్థానికులు స్వర్ణటోల్‌వే అధికారులకు ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన స్వర్ణ టోల్‌వే మేనేజర్ విక్రమ్‌రెడ్డి ఆక్రమణలను తొలగించాలని సిబ్బందిని ఆదేశించారు.

పొట్టు రవాణాతో తీవ్ర ఇబ్బందులు



వెంకటాచలంలో ఆగి ఉన్న పొట్టు ట్రాక్టర్లు

వెంకటాచలం : మండలంలో పొట్టు రవాణా ట్రాక్టర్ల రద్దీతో వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కృష్ణపట్నం పోర్టు రోడ్డు వెంబడి ఉన్న వివిధ ఫ్యాక్టరీలకు నిత్యం నెల్లూరు నగరం నుంచి ట్రాక్టర్లు పొట్టు సరఫరా చేస్తున్నారు. అయితే నిబంధనలు పాటించకుండా రవాణా చేస్తుండడం ఇబ్బందులకు గురిచేస్తోంది. పొట్టులోడుతో వెళ్లే ట్రాక్టర్లు ప్లాస్టిక్ పట్టలు కట్టి, వెనుక వైపు వచ్చే వాహనచోదకులకు ఎలాంటి అసౌకర్యం తలెత్తకుండా చూడాలి. పొట్టును రవాణా చేసే నిర్వాహకులు పట్టలు సక్రమంగా కట్టకపోవడంతో వెనుక వచ్చే వాహనచోదకులు పొట్టు పడుతుండటంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పొట్టు అన్‌లోడ్ చేసివచ్చే ట్రాక్టర్ల నుంచి కూడా వెనుక వచ్చే వాహన చోదకులకు ఇబ్బందులు కలుగుతున్నా నిర్వాహకులు పట్టించుకోవడం లేదు. పోలీసులు జోక్యం చేసుకుని పొట్టు రవాణా చేసే నిర్వాహకులు నిబంధనలు కచ్చితంగా పాటించేలా చర్యలు చేపట్టాలని ప్రయాణికులు కోరుతున్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

నెల్లూరు సిటీ: తెలుగుగంగ సబ్‌స్టేషన్ పరిధిలోని 11 కేవీ సంజయ్‌గాంధీనగర్ ఫీడర్‌లో కొత్త ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేయనున్న నేపథ్యంలో పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా సోమవారం ఉండదని ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సోమశేఖర్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏవీకే ఎస్టేట్స్, శాంతినగర్, తెలుగుగంగ కాలనీ, డైకస్‌రోడ్డు, జేకే కాలనీ తదితర ప్రాంతాల్లో ఉదయం 7.30 నుంచి మధ్యాహ్నం 12.30 వరకు సరఫరా ఉండదని చెప్పారు.

నిషేధమా.. అదెక్కడా..?

- నగరంలో విచ్చలవిడిగా ప్లాస్టిక్ కవర్ల వినియోగం
- తూతూమంత్రంగా అధికారుల తనిఖీలు



అంతా హడావుడే..

నెల్లూరు(బారకాసు): నగరంలో ప్లాస్టిక్ కవర్లను నిషేధిస్తామనే అధికారుల ప్రకటనలు నీటిమూటలుగా మారుతున్నాయి. నెల్లూరులో వీటి విక్రయాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. పట్టించుకోవాల్సిన అధికారులు తూతూమంత్రపు తనిఖీలకే పరిమితమవుతున్నారు.

అన్ని చోట్ల యథేచ్ఛగా..

నగరంలో పాలిథిన్ కవర్ల వాడకం రోజురోజుకూ అధికమవుతోంది. కిరాణా షాపులు, కూరగాయల మార్కెట్, చికెన్ దుకాణాలు, హోటళ్లు.. ఇలా ప్రతి చోట ప్లాస్టిక్ కవర్లే దర్శనమిస్తున్నాయి. వాస్తవానికి గతంలో అధికారులు చేపట్టిన చర్యల ఫలితంగా కిరాణా కొట్ల యజమానులు ప్లాస్టిక్ వినియోగాన్ని కొంత కాలం నిషేధించారు. కవర్లు లేవని ఖాతాదారులకు చెప్పిన సందర్భాలూ ఉన్నాయి. అయితే అనంతరం దీన్ని అందరూ మర్చిపోయారు. ఇంట్లో పేరుకుపోయిన చెత్తను ప్లాస్టిక్ కవర్లలో వేసి బయట పడేస్తుండటంతో వీటిని తిని పశువులు సైతం అనారోగ్యం బారిన పడుతున్నాయి.

పాలిథిన్, ప్లాస్టిక్ కవర్ల విక్రయాలను అడ్డుకునేందుకు నెల్లూరు నగరపాలక సంస్థ ఆరోగ్యాధికారి వెంకటరమణ కొంత కాలం పాటు చర్యలు చేపట్టారు. వ్యాపారులను మందలించి.. జరిమానాలను విధించారు. అయితే ఇటీవల దాడులు తగ్గడంతో ప్లాస్టిక్ కవర్లను యథేచ్ఛగా వినియోగిస్తున్నారు. స్టోన్‌హౌస్‌పేట, చిన్నబజార్, పెద్దబజార్, మద్రాస్ బస్టాండ్ సమీపంలోని కూరగాయల మార్కెట్ తదితర ప్రాంతాల్లో కవర్ల విక్రయాలు జరుగుతున్నాయి. అధికారులు ఇప్పటికైనా స్పందించి వీటి విక్రయాలు, వినియోగాన్ని అరికట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

చర్యలు చేపడతాం



దుకాణాలపై ఇటీవల దాడులు నిర్వహించి యజమానులను మందలించాం. దీంతో ప్లాస్టిక్, పాలిథిన్ కవర్ల విక్రయాలు, వినియోగం చాలా వరకు తగ్గింది. ఎక్కడైనా విక్రయాలు జరుపుతుంటే చర్యలు చేపడతాం. శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, సచివాలయ శానిటరీ సెక్రటరీలకు బాధ్యతలను అప్పగించాం.

– వెంకటరమణ, హెల్త్ ఆఫీసర్, నగరపాలక సంస్థ

ముగిసిన కాశీవిశ్వనాథుడి బ్రహ్మోత్సవాలు



నెల్లూరు(బృందావనం): ఉస్మాన్‌సాహెబ్‌పేటలోని అన్నపూర్ణ, విశాలాక్షి సమేత కాశీ విశ్వనాథ స్వామి దేవస్థానంలో నిర్వహిస్తున్న వార్షిక బ్రహ్మోత్సవాలు ఏకాంతసేవతో ఆదివారం ముగిశాయి. విశేష పూజా కార్యక్రమాలను అర్చకులు వందవాసి విశ్వనాథ గురుకుల్, వందవాసి గణేష్ గురుకుల్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈఓ దర్గయ్య, మహేష్ పర్యవేక్షించారు.

విద్యతో ఉజ్వల భవిష్యత్తు



బహుమతులను అందజేస్తున్న నిర్వాహకులు

నెల్లూరు(వేదాయపాళెం): విద్యతో ఉజ్వల భవిష్యత్తు సాధ్యమని యాదవ ఎంప్లాయిస్, ప్రొఫెషనల్స్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ మాదాల వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. పదో తరగతిలో 475కుపైగా మార్కులను సాధించిన 450 మంది విద్యార్థులకు ప్రోత్సాహక నగదు బహుమతులు, జ్ఞాపికలను హరనాథపురంలోని డాక్టర్ జెట్టి శేషారెడ్డి విజ్ఞాన కేంద్రంలో ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావు, బీఎమ్మార్ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా ఈ ప్రోత్సాహకాలను అందించామని వివరించారు. ప్రథమ బహుమతిగా ఒకరికి రూ.పది వేలు, ద్వితీయ బహుమతిగా ముగ్గురికి రూ.ఏడు వేల చొప్పున, తృతీయ బహుమతిగా రూ.ఐదు వేలు, నాలుగో బహుమతిగా రూ.మూడు వేల చొప్పున ఎనిమిది మందికి అందించారు. మిగిలిన విద్యార్థులకు కన్సొలేషన్ బహుమతులను అందజేశారు. జిల్లా అటవీ శాఖ అధికారి ఆవుల చంద్రశేఖర్, అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు గుర్రం నాగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి డాక్టర్ మాదాల వెంకటరాజేష్, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కొండయ్య, మేకల మహేష్, ఆర్థిక కార్యదర్శి సురేష్, బీసీ సంఘ నేత దేవరాల సుబ్రహ్మణ్యం, ఎనెల్ హాస్పిటల్ చైర్మన్ నాగేంద్ర, డాక్టర్ పిట్టి మల్లికార్జున, ఆల్ఫా మెరైన్ యజమాని సుధాకర్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

భక్తుల కొంగుబంగారం వెంకటేశ్వరుడు



పొదలకూరు : పట్టణంలోని శ్రీనివాస లేఅవుట్‌లో ఉన్న శ్రీలక్ష్మీగోదా సమేత వెంకటేశ్వరస్వామి దేవస్థానం భక్తుల కొంగుబంగారమైంది. పూర్తిగా రాతితో నిర్మించిన అరుదైన దేవాలయం కావడంతో వెంకన్న దేవస్థానం గుర్తింపు తెచ్చుకుంది. దాతల సహకారం, భక్తుల అకుంఠిత దీక్షతో ఏడేళ్ల తర్వాత దేవస్థానం నిర్మాణం పూర్తి చేసుకుని స్వామి అమ్మవార్ల విగ్రహ ప్రతిష్ట మహోత్సవం జరిగింది. అప్పటి నుంచి ఇక్కడ నిర్వాహకులు స్వామికి వార్షిక బ్రహ్మోత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నారు. ఈనెల 28 నుంచి జూన్ 3వ తేదీ వరకు ద్వితీయ వార్షికోత్సవ బ్రహ్మోత్సవాలను నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఈ ప్రాంతంలో ఎలాంటి అంచనాలు లేకుండా భక్తులు స్వామివారి దేవస్థాన నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. సుమారు రూ.4 కోట్ల వ్యయంతో కష్టనష్టాల కోర్చి దాతల పూర్తి సహాయ, సహకారాలతో ఎట్టకేలకు నిర్మాణ పనులను పూర్తి చేయగలిగారు.

చినజీయర్ చేతులమీదుగా..

2015 జూన్ 11వ తేదీన శ్రీరామచంద్రజీయర్ చేతుల మీదుగా దేవస్థానం నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అప్పటి నుంచి భక్తులే నిర్మాణ కమిటీగా మారి నిర్మాణాన్ని పూర్తి చేశారు. దేవస్థానంలో వెంకటేశ్వరస్వామితో పాటు అమ్మవార్ల విగ్రహాలు, ధ్వజస్తంభం ప్రతిష్ట చేపట్టనున్నారు. ఆలయం వెలుపల శ్రీఆంజనేయస్వామి దేవస్థానం నిర్మాణ పనులు జరుగుతున్నాయి. చుట్టూ ప్రాకారం నిర్మాణ పనులను పూర్తి చేశారు. స్వామి ఊరేగింపునకు రూ.కోటి నిధులతో రథం రూపొందిస్తున్నారు. శ్రీత్రిదండి శ్రీమన్నారాయణ చినజీయర్ స్వామి చేతులమీదుగా విగ్రహ ప్రతిష్ట మహోత్సవం నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో వెంకటేశ్వరస్వామి, పద్మావతి, గోదాదేవి అమ్మవార్లు, శ్రీగరుడ ఆళ్వార్‌స్వామి ఆలయ నిర్మాణాలు పూర్తి చేశారు.



హోమశాలలో ఏర్పాట్లు చేస్తున్న వేదపండితులు



తయారవుతున్న స్వామి అమ్మవార్ల రథం

గణనాథునికి ప్రత్యేక పూజలు



ప్రత్యేకాలంకారంలో వినాయకస్వామి

మనుబోలు : మనుబోలు బీసీ కాలనీ సమీపంలో వెలసిన శ్రీవరసిద్ధి వినాయకునికి ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. సంకటహర చతుర్థి సందర్భంగా అర్చకుడు శ్రీనివాసులు స్వామివారికి పంచామృతాలతో అభిషేకం నిర్వహించి ప్రత్యేక అలంకరణ చేశారు. అనంతరం పూజలు చేసి భక్తులకు తీర్థ ప్రసాదాలు వితరణ చేశారు. ఉభయకర్తలుగా పముజుల పరంధామయ్య, శివానందమ్మ దంపతులు వ్యవహరించారు.

ప్రమాదకరంగా మలుపు



పొదలకూరు : పొదలకూరు–కలువాయి మార్గం లింగంపల్లితోపునకు సమీపంలో ఉన్న మలుపంటే వాహనచోదకులకు హడల్. ఆటోలు ఢీ, టిప్పర్లు బోల్తా, మోటారుబైకుల ఢీ, ట్రాక్టర్లు బోల్తా తదితర రోడ్డు ప్రమాదాలు సంభవించి ప్రాణాలను సైతం కోల్పోయారు. ఈ మార్గంలో కొత్తగా వాహనం నడిపే వారు ప్రమాదాలకు గురవుతుంటారు. మలుపు మీదుగా వెళ్లే సమయంలో ఎదురువచ్చే వాహనం సరిగ్గా కనిపించకపోవడం వల్ల ప్రమాదాలు సంభవిస్తున్నాయి. అయితే ఆర్ అండ్‌బీ అధికారులు ఈ మలుపు వద్ద హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయడం లేదు. గత పదేళ్లుగా పదుల సంఖ్యలో ప్రమాదాలు జరిగినా సంబంధిత అధికారులు స్పందించకపోవడం విశేషం. నిత్యం రద్దీగా ఉండే మార్గంలో ఇకనైనా హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయాల్సిందిగా వాహనచోదకులు విజ్ఞప్తి చేస్తున్నారు.

ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు

పొదలకూరు : ప్రభుత్వ పాఠశాలలో టెన్త్ పరీక్షల్లో ప్రతిభ కనపరిచి మండల స్థాయిలో ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు స్థానిక సాయిబాబా మందిరంలో ఈనెల 30న బహుమతులు అందజేస్తామని మందిర సేవాసమితి సభ్యుడు లక్కాకుల ఆనందరావు ఆదివారం తెలిపారు. ప్రతిభ కలిగిన విద్యార్థులను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో మందిర సేవాసమితి ప్రతి ఏడాది ఇలాంటి కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు.

దంపూరులో రక్తదాన శిబిరం



విడవలూరు : మండలంలోని దంపూరు గ్రామంలో ఉన్న ప్రభుత్వ పాఠశాలలో ఆదివారం రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. మద్దులూరు పద్మ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 50 మంది యువకులు రక్తదానం చేశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ వ్యవస్థాపకుడు మల్లి కిశోర్ మాట్లాడుతూ యువకులు స్వచ్ఛందంగా తరలివచ్చి రక్తదానం చేయడం ఆనందంగా ఉందన్నారు. అనంతరం రక్తదాతలకు గ్రామస్తులు అభినందనలు తెలిపారు.

పాలిటెక్నిక్ కళాశాలలో జాబ్ అచీవర్స్ డే



విద్యార్థికి నియామక పత్రాల అందజేత

నెల్లూరు (టౌన్): వెంకటేశ్వరపురంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో జాబ్ అచీవర్స్ డేను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులకు నియామక పత్రాలను అందజేశారు. ముఖ్యఅతిథిగా హాజరైన జిల్లా ఎంప్లాయ్‌మెంట్ అధికారి రామాంజనేయులు మాట్లాడారు. రానున్న సంవత్సరంలో ఎక్కువ మంది ఉద్యోగాలు సాధించేలా తన వంతు కృషి చేస్తానని చెప్పారు. అనంతరం కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపల్ రామ్‌ప్రసాద్ మాట్లాడారు. క్యాంపస్ ప్లేస్‌మెంట్ల ద్వారా సివిల్, డీసీసీపీ, ఎలక్ట్రికల్, మెకానికల్ విద్యార్థులకు ఉద్యోగాలను కల్పించామని వివరించారు. డిప్యూటీ డైరెక్టర్ విజయభాస్కర్, ఎస్బీడీసీఎల్ డీఈఈ శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

గుర్తింపు కార్డుల పంపిణీ



నెల్లూరు (వీఆర్సీ సెంటర్): చేతివృత్తుల వారికి కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో అందజేసిన గుర్తింపు కార్డులను నెల్లూరు జిల్లా విశ్వబ్రాహ్మణ సంఘ అధ్యక్షుడు ఖాజన వెంకటశేషయ్య ఆచారి ఆదివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ కార్డు కలిగిన ప్రతి ఒక్కరికీ కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న కొన్ని పథకాలు వర్తిస్తాయని వివరించారు. ఇప్పటికీ దరఖాస్తు చేసుకోని వారు తమ కార్యాలయాన్ని సంప్రదించాలని కోరారు. జిల్లా కోశాధికారి ఏలూరు బాబు, ఉపాధ్యక్షుడు వేములూరి రఘురామయ్య, ఆర్గనైజింగ్ సెక్రటరీ ఇలపాక శివప్రసాద్, నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి



విద్యార్థులకు బహుమతుల ప్రదానం

నెల్లూరు(క్రైమ్): అవకాశాలను సద్వినియోగం చేసుకొని చదువుల్లో రాణించాలని ఫైర్ సర్వీసెస్ డైరెక్టర్ మురళీమోహన్ పిలుపునిచ్చారు. 2023 – 24 విద్యాసంవత్సరంలో పదో తరగతిలో ఉత్తీర్ణులైన విద్యార్థులకు జనరల్ నాలెడ్జి పరీక్షను నగరంలోని పద్మావతి స్కూల్లో ఆదివారం నిర్వహించారు. అత్యధిక మార్కులు సాధించిన ఈశ్వర్, జాన్సన్, ఈమ్మా ప్రైసీకి రూ.25 వేలు, రూ.15 వేలు, రూ.పది వేల చొప్పున అందజేశారు. పరీక్షకు హాజరైన విద్యార్థులకు స్టడీ మెటీరియల్లను ఇచ్చారు. డాక్టర్ అనూరాధ, డీఎఫ్‌ఓ శ్రీనివాసరెడ్డి, మాదిగ ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు భిక్షులు, అదనపు కార్యదర్శి శేషు మాదిగ, వర్కింగ్ ప్రసిడెంట్ జయరాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి మస్తానయ్య, గూడూరు డివిజన్ అధ్యక్షుడు నారాయణ తదితరులు పాల్గొన్నారు.

ప్రతిఫలాపేక్షలేని కర్తవ్యం కృష్ణపరమాత్మ మార్గం



హనుమజ్జానకీరామశర్మ చిత్రపటానికి నివాళులు

నెల్లూరు(బృందావనం): ప్రతిఫలాపేక్ష లేకుండా పనులు చేయడమే కృష్ణపరమాత్మ చూపిన మార్గమని ఇనమడుగులోని సత్యానందాశ్రమ పీఠాధిపతి శ్రీహరితీర్థ పేర్కొన్నారు. బ్రహ్మశ్రీ పోలూరి హనుమజ్జానకీరామశర్మ శత జయంత్యుత్సవాల్లో భాగంగా సప్తమ సమావేశాన్ని పురమందిర ప్రాంగణంలోని వర్ధమాన సమాజ హాల్లో ఆదివారం నిర్వహించారు. హనుమజ్జానకీరామశర్మ రచన విజయపథం గ్రంథంపై ఉపన్యసించారు. తొలుత ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం శ్రీహరితీర్థను సత్కరించారు. పద్యకళా పరిషత్ అధ్యక్షుడు మెట్టు రామచంద్రప్రసాద్, కార్యదర్శి చీమకుర్తి వెంకటేశ్వరరావు, కోశాధికారి నలుబోలు బలరామయ్యనాయుడు, కోట రాజశేఖర్, జయప్రకాష్, వెంకటస్వామిరెడ్డి వేదం రాధాకృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

సిమెంట్ బెంచీల బహూకరణ



నెల్లూరు(బృందావనం): ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో వాకర్స్ విశ్రాంతి తీసుకునేందుకు వీలుగా రూ.35 వేల విలువజేసే సిమెంట్ బెంచీలను వివేకానంద వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం అందజేశారు. వాకర్స్ అసోసియేషన్ సభ్యుడు పెంచలరెడ్డి, డాక్టర్ సత్యనారాయణ ఎమ్మెస్ రెడ్డి, హరిప్రసాద్, సుబ్బరాజు, రమేష్‌బాబు, జయదేవ్, నరేంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు పౌష్టికాహార అందజేత



నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో నిర్వహిస్తున్న వేసవి శిబిరంలో వివిధ క్రీడల్లో శిక్షణ పొందుతున్న 900 మంది క్రీడాకారులకు పౌష్టికాహారాన్ని స్టేడియం వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం పంపిణీ చేశారు. కార్యక్రమాన్ని హైటెక్ ఫార్మా అధినేత రమణారెడ్డి సౌజన్యంతో నిర్వహించారు. అనంతరం ఆయన్ను సత్కరించారు. వాకర్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ – 208 గవర్నర్ పలగాటి శ్రీనివాసులురెడ్డి, అసోసియేషన్ నిర్వాహకులు దాసరి అనంతరామారావు, గుర్రం వెంకటసురేంద్రబాబు, అరిగెల సాయిరామ్, రఘురామ్ ముదిరాజ్, నలుబోలు బలరామయ్యనాయుడు, బాసం శేషగిరిరావు తదితరులు పాల్గొన్నారు.